# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :137 EDITOR:CHERUKU UPENDAR, DATE : THURSDAY 28 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 137 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 28 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## కేసిఆర్ తోనే సమగ్రాభివృద్ధి

**- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**



బాల్కొండ- ప్రభాత సూర్యుడు

బాల్కొండ నియోజకవర్గంలోని ముప్కాల్, మెండోరా మండలాల్లో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు డప్పు

మిగతా 2లో...

## "గోల్కొండ కోటపై బీజేపీ భారీ స్కెచ్"

# తెలంగాణలో గెలుపే లక్ష్యం



- గోల్కొండకు బిజెపి గట్టి సూటి
- ఇతర ఉత్తర భారత రాష్ట్రాల కొత్త ఓటర్లను వేల సంఖ్యలో నమోదుకై వ్యూహం.
- పట్టణ మున్సిపాలిటీలు మరియు జిహెచ్ఎంసి కొత్త ఓటర్ల నమోదుకు భారీ స్కెచ్
- 30 నుండి 40 నియోజకవర్గాల గెలుపే లక్ష్యం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి స్థిర నివాసం ఉంటున్న బంధువుల సహకారంతో!! పెద్ద ఎత్తున గుజరాత్ ,రాజస్థాన్, హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, బీహార్ ,వెస్ట్ బెంగాల్ లతో పాటు ఇంకా బిజెపికి బలంగా ఉన్న రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో తెలంగాణ లోని 30 నుండి 40 నియోజకవర్గాలలో ఆయా రాష్ట్రాల నుంచి 18 సంవత్సరాలు నిండిన వారిని నూతన ఓటర్లుగా ఓటర్ లిస్టులో పేర్లను భారీ ఎత్తున నమోదు చేపించేటట్లు బిజెపి భారీ స్కెచ్ వేసినట్లు విశ్వసనీయ సమాచారం. తెలంగాణలోని పట్టణ, మునిసిపాలిటీ లను టార్గెట్ గా పెట్టుకొని ముఖ్యంగా కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ

మిగతా 2లో...



కస్టా శంకర్రావు

## జనవరి 22న రామమందిరం ప్రారంభం



లక్నో- ప్రభాత సూర్యుడు


అయోధ్యలో రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి 22వ తేదీన ప్రాణప్రతిష్ఠ ఉండవచ్చని రామాలయ నిర్మాణ కమిటీ ఛైర్ పర్సన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. జనవరి 20వ తేదీ నుంచి 24వ తేదీ మధ్య ఏ రోజు అయినా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారని, కచ్చితమైన తేదీని ప్రధాన మంత్రి కార్యాలయం ఇంకా తెలియజేయలేదని నృపేంద్ర మిశ్రా వెల్లడించారు. ఈ భవ్య మందిరాన్ని మూడంతస్తుల్లో నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి అవుతుందని నిర్మాణ కమిటీ ఛైర్ పర్సన్ తెలియజేశారు.

అయోధ్య భవ్య రామ మందిర నిర్మాణ

మిగతా 2లో...

### చంద్రబాబు స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణ

## అక్టోబర్ మూడో తేదీకి వాయిదా



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం కుంభకోణం కేసు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణను అక్టోబర్ మూడో తేదీకి వాయిదా వేసింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ కింద గవర్నర్ అనుమతి తీసుకోకుండా తనపై ఏపీ సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ చంద్రబాబు సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. అంతకుముందు

చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను

మిగతా 2లో...

# 5 వేల కోట్లపైనే కేసీఆర్ ఆశలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట ఆందోళన చేస్తున్నారు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు నిర్మించిన సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. కొందరైతే ఆత్మహత్యలు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరైతే భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేస్తున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల కార్డులతో బలం పుంజుకుంది. సాధారణంగా గ్రూపు కొట్లాటలు ఉండే ఆ పార్టీలో ఇప్పుడు కొత్త వాతావరణం కనిపిస్తుంది. దానికి భిన్నంగా భారత రాష్ట్ర సమితిలో నేతల మధ్య వివాదాలు పొడచూపుతున్నాయి. పైగా అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించినప్పటికీ వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయి. ఇన్ని సమస్యలకు నిధుల విడుదల ఒకటే పరిష్కార మార్గం అని కెసిఆర్ భావించారు. ఈ క్రమంలో ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు.మరో రెండు వారాల్లో ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి 5000 కోట్లు విడుదల చేస్తామని ఆయన కార్యాలయ వర్గాలు ప్రకటించాయి. వీటిని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేల ఖాతాల్లో జమ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే ప్రభుత్వం కేటాయించిన అరకొర నిధులు నిండుకున్నాయి. దీంతో ఎమ్మెల్యేలు ఏం చేయలేని పరిస్థితి. మరోవైపు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2021 నుంచి ఎంపీలతో సమానంగా ఎమ్మెల్యేలకు సిడిఎఫ్ ను మూడు నుంచి ఐదు కోట్లకు పెంచింది. అయితే అంతకుముందు సంవత్సరాలలో కోవిడ్ ప్రభావం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం సిడిఎఫ్ కేటాయించలేదు. ఫలితంగా అప్పట్లో ఎమ్మెల్యేలు ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోయారు. ఇక 2021 నుంచి సి డి ఎఫ్ రిలీజ్ అయినప్పటికీ అందులో మూడు కోట్ల నిధులను ప్రతి ఎమ్మెల్యే మన ఊరు మనబడి కింద ఖర్చు

మిగతా 2లో...

### గవర్నర్ నిర్ణయం...

## బీసీలకు అన్యాయం

**బీసీ వర్గాలకు వ్యతిరేకమని మరోసారి నిరూపించుకున్న బిజెపి**

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం**



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవుల్లో నామినేట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను తిరస్కరిస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమది బీసీ వ్యతిరేక పార్టీ అని

భారతీయ జనతా పార్టీ

మిగతా 2లో...

### సనత్ నగర్ నియోజక వర్గంలో

## రూ.1400 కోట్లతో అభివృద్ధి

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


సనత్ నగర్ నియోజకవర్గంలో రూ. 1400 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం రాత్రి బేగంపేట డివిజన్ పాటి గడ్డలో రూ.5.90 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.1400 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. పాటిగడ్డ ప్రాంతంలో ముస్లింలు, హిందువులు రెండు కళ్ళు లాంటివారని వారందరికీ మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ నిర్మాణాలు

చేపట్టి ఎలాంటి సమస్య లేకుండా

మిగతా 2లో...

# విప్లవ చైతన్యానికి మారుపేరు భగత్ సింగ్

## నేడు అయన జయంతి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

భగత్ సింగ్ ఈ పేరు వినగానే ప్రతి భారతీయుడి రోమాలు నిక్క పోడుచుకుంటాయి." ఇన్ క్విలాబ్ జిందాబాద్ " అంటూ ప్రతి భారతీయులులో స్వతంత్ర కాంక్ష నింపిన వీరుడు, భరత మాత దాస్యపు శృంకాలాలు నుండి విముక్తి చేయడం కోసం తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా దివికేగిన నిప్పు కణిక షాహిద్ భగత్ సింగ్.ఆ దేశభక్తుడి ధైర్య సాహసాలు తెలుసు కుందాం బావి తరాలకు తెలియ జేద్దాం. పంజాబ్ రాష్ట్రంలోని ఖత్కర్ కలాన్ ప్రాంతంలో సెప్టెంబరు 28, 1907 తేదీన కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు భగత్ సింగ్. అప్పటికే అతని కుటుంబ సభ్యులు స్వతంత్రపోరాటంలో వున్నారు. ఈ పిల్లాడు పుట్టగానే జైల్ లో ఉన్న వారినందరినీ విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అది పిల్లాడు పుట్టిన వేళావిశేషంగా భావించి ఆ బిడ్డకు" భగత్ " అని పేరు పెట్టారు.. భగత్ చిన్నప్పటి నుండే దేశపరిస్థితులు గమనిస్తూ పెరిగాడు.. భగత్ ను 12వ యేట తండ్రి ఆంగ్లేయుల పాఠశాలలో కాకుండా ఆర్యసమాజ్ నడిపే "ఆంగ్లో వైదిక్ "పాఠశాలలో చేర్చాడు. ఖల్సా పాఠశాలలకు కూడా పంపలేదు. అదే సమయంలో జలియన్ వాలాబాగ్ దురంతం జరిగింది. 13 యేళ్ళ భగత్ ఆ దుర్ఘటన విని కోపంతో ఊగిపోయాడు. జలియన్ వాలాబాగ్ కు వెళ్ళి ప్రతీకారం తీసుకుంటానని ప్రతిజ్ఞ చేస్తూ రక్తంతో తడిసిన ఆ మట్టిని తిలకంగా తిద్దుకున్నాడు. గాంధీజీ యుగం ప్రారంభమైంది. భగత్, గాంధీ ప్రసంగాలకు ఆకర్షితులైనాడు. గాంధీజీ స్వాతంత్రం తీసుకుస్తాడని నమ్మాడు. సహాయ

మిగతా 3లో...

### గవర్నర్ కు రిటర్న్ గిఫ్ట్...

## మళ్లీ ఎమ్మెల్సీల పేర్లు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తెలంగాణ మంత్రివర్గం సిఫారసు చేసిన పేర్లను గవర్నర్ తమిళిశై సౌందరరాజన్ తిరస్కరించారు. వర్నర్ కోటా కింద ప్రభుత్వం సిఫార్సు చేసిన ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను సోమవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించడం వివాదానికి దారి తీసింది. దీనిని ప్రభుత్వం తీవ్రంగా తప్పుబట్టడమే కాకుండా తమిళిసై టార్గెట్‌గా విమర్శలు చేస్తున్నారు. గవర్నర్ నిర్ణయాన్ని మంత్రులు,

బీఆర్ఎస్ నేతలు ఖండిస్తున్నారు.

మిగతా 2లో...

# జనవరి 22న రామమందిరం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

పనులపై కమిటీ ఛైర్ పర్సన్ నృపేంద్ర మిశ్రా మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ వర్క్ జరుగుతోందని, ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున గర్భాలయంలోని దేవతా విగ్రహాలపై సూర్య కిరణాలు ప్రసరించేలా దీన్ని డిజైన్ చేస్తున్నారని తెలియజేశారు. బెంగళూరులో శిఖర నిర్మాణం చేపడుతున్నామని, సైంటిస్ట్ లు పర్యవేక్షణలో డిజైన్ వర్క్ జరుగుతోందని చెప్పారు. ఇందుకోసం రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పుణెలోని మరో ఇన్‌స్టిట్యూట్ కలిసి కంప్యూటరైజ్డ్ ప్రోగ్రామ్ రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించారు. 2024 జనవరి 15వ తేదీ అలాగే 24వ తేదీ జనవరి 2024 మధ్య శ్రీరామ చంద్రుడిని ప్రతిష్టించవచ్చని అన్నారు. ప్రాణ ప్రతిష్ఠ చివరి రోజున ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం పంపనున్నట్లు నృపేంద్ర మిశ్రా గతంలో తెలిపారు. గర్భగుడి ప్రధాన ద్వారం బంగారంతో కప్పబడి ఉంటుందని దానిపై బంగారు చెక్కడం ఉంటుందని నృపేంద్ర చెప్పారు. 161 అడుగుల ఎత్తైన ఆలయ శిఖరానికి కూడా బంగారు పూత పూయనున్నట్లు వివరించారు. ఆలయ శంకుస్థాపన జరిగినప్పుడే అయోధ్యకు వెళతానని ప్రధాని తన మనసులో అనుకున్నారని.. అందుకే 2021 ఆగస్టు 5న ఇక్కడికి వచ్చానని చెప్పారు. రాముడి విగ్రహ తయారీపై ప్రత్యేక దృష్టి సారించింది రామ మందిర ట్రస్ట్. దాదాపు ఆరడుగుల రాముడి విగ్రహాన్ని తయారు చేయించి...వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి ప్రతిష్ఠించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అయితే..ఈ విగ్రహ తయారీ కోసం ప్రత్యేక శిలలు తెప్పించింది. నేపాల్ నుంచి రెండు సాలగ్రామ శిలలను తరలించారు. ఇప్పటికే ఇవి అయోధ్యకు చేరుకున్నాయి. రామ మందిర ప్రాంగణానికి చేరుకోగానే పూజారులు, స్థానికులు ఆ శిలలకు ఘనస్వాగతం పలికారు. పూలతో అలంకరించారు. పూజలు చేశారు. ఆ తరవాత ఆ శిలలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అప్పగించారు. రాముడితో పాటు సీతా దేవి విగ్రహాన్నీఈ శిలతోనే తయారు చేయనున్నారు. గర్భాలయంలో ఈ రెండు విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. నేపాల్‌లోని కలి గండకి నదీ తీరంలో ఈ శిలలను సేకరించారు. వీటిని సీతాజన్మ స్థలిగా భావించే జానక్‌పూర్ నుంచి ప్రత్యేక క్రేన్‌ల ద్వారా అయోధ్యకు తరలించారు. ఈ రెండు సాలగ్రామ శిలల్లో ఒక దాని బరువు 18 టన్నులు కాగా...మరోటి 16 టన్నులు. విగ్రహ తయారీకి ఈ రెండు శిలలు అనువుగా ఉన్నట్టు అధికారులు నిర్ధరించారు.

## చంద్రబాబు స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణ

# అక్టోబర్ మూడో తేదీకి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

తిరస్కరిస్తూ గత శుక్రవారం హైకోర్టు జస్టిస్ కే శ్రీనివాసరెడ్డి తీర్పు ఇచ్చారు. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ శనివారం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. తొలుత చంద్రబాబు పిటిషన్‌పై విచారణ చేపట్టడానికి సుప్రీంకోర్టు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి విముఖత ప్రదర్శించారు. దీంతో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ వద్ద చంద్రబాబు క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ లుథ్రా ప్రస్తావించారు. తక్షణం కేసు లిస్టింగ్ చేయాలని కోరారు. చంద్రబాబు బెయిల్ కోరుకుంటున్నారా? అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రశ్నించినప్పుడు.. తాము బెయిల్ కోరుకోవడం లేదని లుథ్రా అన్నారు.'చంద్రబాబు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను త్వరితగతిన కేసు లిస్టింగ్ చేయాలని మా తొలి అభ్యర్థన. మధ్యంతర రిలీఫ్ కల్పించాలని రెండో అప్పీల్. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ సెక్షన్ అంటే కేసు మూలాలపై చర్చించాల్సిన అంశం. ఎఫ్ఐఆర్ ప్రకారం చంద్రబాబును కస్టడీలో పెట్టదగిన కేసు కాదు. మేం బెయిల్ కోరుకోవడం లేదు' అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు సిద్ధార్థ లుథ్రా తెలిపారు.'దిగువ కోర్టు న్యాయమూర్తిని సంయమనం పాటించాలని చెప్పలేం. జడ్ క్యాటగిరీ, ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ గల వ్యక్తిని ఇలా ట్రీట్ చేస్తారా.. ఇది పూర్తిగా వ్యక్తిగత స్వేచ్ఛతో కూడిన అంశం. యశ్వంత్ సిన్హా కేసులో వ్యక్తి స్వేచ్ఛపై అన్ని విషయాలు చేర్చారు. కానీ ఈ కేసులో చంద్రబాబును కస్టడీకి అప్పగించాలని ఏపీ సీఐడీ పోలీసులు కోరుతున్నారు. దాని నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నాం' అని లుథ్రా వాదించారు.

## సనత్ నగర్ నియోజక వర్గంలో

# రూ.1400 కోట్లతో అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాటిగడ్డ ప్రాంతంలో నిరుపేదల గృహాలను మరమ్మతులు చేసి ఇస్తామని అందుకు రూ.10 కోట్లు నిధులను వెచిచించనున్నట్లు మంత్రి తలసాని అన్నారు. ఈ ప్రాంత నాయకులతో ఇళ్లను పరిశీలించినట్లు చేపారు. అట్టి కార్యక్రమం కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ను నిరుపేదలకు 15వేలకే అందిస్తామని, ప్రయివేట్ ఫంక్షన్ హాళ్లకు 1 లక్ష రూపాయల నుండి 2 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని కానీ 15000 లకే అందజేస్తామని అన్నారు. అందుకు కుర్చీలు, వంట సామాగ్రి పూర్తిగా ఉచితంగా అందజేయడం జరుగుతుంది. కేవలం కూరగాయలు బియ్యం నూనెలు తెచ్చుకొని ఫంక్షన్లు జరుపుకోవాలని మంత్రి అన్నారు. పాటిగడ్డలో స్థల ప్రభావం వలన ఫంక్షన్ హాలు సకాలంలో నిర్మించుకోలేకపోయామని స్థలం ఆర్ అండ్ బి నుండి రోడ్లు భవనాల శాఖ జిహెచ్ఎంసికి మార్పు చేయడం కోసం ముఖ్యమంత్రిని కోరగానే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారని అందుకు నిధులను కేటీఆర్ ను అడగాలని మంజూరు చేశారని జిహెచ్ఎంసి ద్వారా తక్కువ కాలంలో ఫంక్షన్ హాల్ నిర్మించి ఇచ్చినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఐటి ప్రాంతంలో సిసి రోడ్లు నిర్మిస్తున్నప్పటికీ పేదల నివసించే కాలనీలో కూడా సిసి రోడ్లు వేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని, ఒక యాభై ఏళ్లల్లో జరగని అభివృద్ధి 9 నెలల జరిగిందని బీదలు ధైర్యంగా బతకాలనేదే ప్రభుత్వ లక్ష్యమని అందుకు కేసిఆర్ పేదల పక్షపాతం అయినందున పేదలు ఆడపిల్లలకు వివాహం కోసం తల్లిదండ్రులకు ఇబ్బంది కాకూడదని ఉద్దేశ్యంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆర్థిక సాయంతో పెళ్లి ఫంక్షన్ కేసిఆర్ గారే చేస్తున్నారని అన్నారు. ఈ ఫంక్షన్ హాల్ 17మీటర్ల విస్తీర్ణంలో నిర్మించడం జరిగింది ఒకటవ అంతస్తులో భోజన వసతి రెండో అంతస్తులు పెళ్లి కార్యక్రమాలు గ్రౌండ్ ఫ్లోర్ లో పార్కింగ్ ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఎస్సీ అనిల్ రాజ్, డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# 5 వేల కోట్లపైనే కేసీఆర్ ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఒక్కొక్క ఎమ్మెల్యేకు రెండు కోట్లు మాత్రమే మిగిలాయి. ఆ రెండు కోట్లు కూడా ఏ మూలకు సరిపోకపోవడంతో బేల చూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు మొత్తం ప్రగతి భవన్ ను ఆశ్రయిస్తున్నారు. వచ్చేనెల 6న అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలలో ఆందోళన నెలకొంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా మారడం, ముందుగానే అభ్య ర్థులను ప్రకటించినప్పటికి ఒకింత నిరాశ వాతావరణం నెలకొనడంతో నేరుగా ముఖ్య మంత్రి రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. అయితే బడ్జెట్లో ప్రభుత్వం ఎస్డిఎఫ్ కు పదివేల కోట్లు కేటాయించింది. ఇప్పుడు తమ వద్ద నిధులు లేకపోవడంతో ఎమ్మెల్యేలు వీటినుంచి నిధులు కోరుతున్నారు. అయితే ఇవి కూడా సరిపోవని వారు అంటున్నారు. ఈ నిధులు కాంట్రాక్టుల బకాయిలు చెల్లించేందుకు కూడా సరిపోవని వారు వాపోతున్నారు.

అయితే ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో మెజారిటీ పనులను భారత రాష్ట్ర సమితికి చెందిన ప్రజాప్రతినిధులు చేశారు. ఇప్పుడు వీరంతా బకాయి బిల్లుల కోసం గగ్గోలు పెడుతున్నారు. వాటిని విడుదల చేయాలని ఎమ్మెల్యేలను కోరుతున్నారు. ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం తెప్పించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధిని గురించి ఐదువేల కోట్లను విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ నిధులు ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఎమ్మెల్యేల ఖాతాల్లో జమ అవుతాయని తెలుస్తోంది. మరి ఈ ఐదు వేల కోట్లు ఓట్లను రాల్చుతాయా లేదా అనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

# గోల్కొండ కోటపై బిజెపి భారీ స్కెచ్

# తెలంగాణలో గెలుపే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాలలోని దాదాపు 30 నుండి 40 నియోజకవర్గాలలో ప్రతి నియోజక వర్గంలో వేల సంఖ్యలో కొత్త ఓటర్ల పేర్లను ఓటర్ లిస్ట్ లో నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఈసారి తెలంగాణ ఎన్నికలలో బిజెపి అధికారంలోకి రాకపోతే భవిష్యత్తులో ఇక బిజెపి అధికారంలోకి రావడం అసాధ్యం అన్న విషయం బిజెపి అగ్ర నాయకత్వం భావించి తెలంగాణలో ఈ భారీ స్కెచ్ వేసినట్లు సమాచారం, అలాగే ఢిల్లీ చీఫ్ లిక్కర్ స్కామ్ కేసులో ఈడి, సి.బి.ఐ దర్యాప్తు సంస్థల పై ఒత్తిడి పెంచి కేసును వేగవంతం చేసి ఢిల్లీ చీఫ్ లిక్కర్ స్కాం కేసులో ప్రధాన సూత్రధారి అయిన కల్వకుంట్ల కవితను అరెస్టు చేసి ఎన్నికల వరకు జైల్లోనే ఉంచి తెలంగాణ ప్రజలలో బిజెపి సింపతి పొంది రాబోయే ఎన్నికలలో బిజెపి లబ్ధి పొంది,గెలవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ రేవంత్ రెడ్డి అన్న మాటలు కూడా బలాన్ని చేకూరుస్తున్నాయి. తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ని తొలగించి ఆ స్థానంలో తిరిగి బండి సంజయ్ ను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు వస్తున్న వార్తలు కూడా బిజెపి భారీ స్కెచ్ లో భాగమే అని బాహాటంగానే ప్రజలు అనుకుంటున్నారు. తుక్కుగూడ కాంగ్రెస్ బహిరంగ సభలో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ వైపు మరుల్చుకునేటట్లు ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు ధీటుగా బిజెపి సైతం ఎన్నికల మేనిఫెస్టోను రూపకల్పన చేసి రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజల ఓట్లు బిజెపికి పడేటట్లు రూపొందిస్తున్నట్లు సమాచారం.

ఏది ఏమైనా ఈసారి తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికలు బి ఆర్ ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ముస్లిం మైనారిటీ ఓట్లను నయాన లేక భయాన తో బిజెపి వైపు షిఫ్ట్ అవుతాయని రాజకీయ అనుభవజ్ఞులు అనడం కొసమెరుపు!!!!

## గవర్నర్ కు రిటర్న్ గిఫ్ట్...

# మళ్లీ ఎమ్మెల్సీల పేర్లు

(మొదటిపేజీ తరువాయి)

గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆమె పనిచేశారని, అలాంటి వారిని గవర్నర్‌గా నియమించవచ్చా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో కేబినెట్ భేటీ నిర్వహించనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. గవర్నర్ నిర్ణయంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశముంది. తదుపరి ఎలా చేయాలనే దానిపై కేబినెట్ భేటీలో కేసీఆర్ చర్చించనున్నారు. వేరేవారిని నామినేట్ చేయాలా? లేదా గవర్నర్ నిర్ణయంపై న్యాయపరంగా ముందుకెళ్లాలా? అనే దానిపై చర్చ జరగనుందని తెలుస్తోంది దాసోజు శ్రావణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను తిరస్కరిస్తున్నట్టు గవర్నర్ ప్రభుత్వానికి లేఖ పంపారు. వారిద్దరికీ ఆర్టికల్ 171 (5) ప్రకారం వారి అర్హతలు సరిపోవని ఆమె స్పష్టం చేశారు. ఈ నిర్ణయంపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. అయితే ఇప్పుడు ఆ ఇద్దరికీ ఎమ్మెల్సీ యోగం లేనట్లేనా ? కేసీఆర్ మళ్లీ వారి పేర్లనే కేబినెట్ లో తీర్మానం చేయించి గవర్నర్‌కు పంపుతారా ? అన్నది చర్చనీయాంశంగా మారింది. దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవులకు తిరస్కరిస్తూ గవర్నర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'తగిన అర్హతలు లేకుండా వారిని నామినేట్ చేయడం తగదు. అర్హతలు ఉన్న ఎంతో మంది ప్రముఖులు రాష్ట్రంలో ఉన్నారు. అర్హులను పరిగణనలోకి తీసు కోకుండా రాజకీయాలతో సంబంధం ఉన్న వారి పేర్లు సిఫార్సు చేయడం సరైంది కాదు. ఎమ్మెల్సీలుగా ఎవరిని నామినేట్ చేయకూడదో ప్రజా ప్రాతినిధ్య చట్టంలో స్పష్టంగా ఉంది. మంత్రివర్గ సిఫార్సులో అన్ని అంశాలను జత చేయలేదు?' అని గవర్నర్ పేర్కొన్నారు. కానీ ఇటీవలి కాలంలో గవర్నర్ కోటాలో కేబినెట్ సిఫారసు చేస్తున్న అన్ని పేర్లు రాజకీయ పునరావాసం కోసమే. పాడి కౌశిక్ రెడ్డి కి ఆమోదం తెలిపేందుకు గవర్నర్ నిరాకరించడంతో .. ఆ పేరు వెనక్కి తీసుకుని మాజీ స్పీకర్ మధుసూదనాచారి పేరును కేబినెట్ సిఫారసు చేసింది. తమిళిసై వెంటనే ఆమోదం తెలిపారు. కానీ వివాదాల్లేని దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను తిరస్కరించారు. గవర్నర్లు కేబినెట్ సిఫారసు చేసిన ఎమ్మెల్సీలను తిరస్కరించిన సందర్భాలు దాదాపుగా లేవు. ఇటీవలి కాలంలో అన్ని రాష్ట్రాల్లో రాజకీయ నేతల్నే గవర్నర్ కోటాలో సిఫారసు చేస్తున్నారు. ఏపీలో కూడా అక్కడి ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలను నామినేట్ చేసింది. అప్పట్లో బిశ్వభూషణ్ హరిచందన్, ఇప్పుడు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన అబ్దుల్ నజీర్ కూడా ఏపీ ప్రభుత్వం సిఫారసు చేసిన పేర్లను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేశారు. ఏపీ నుంచి గవర్నర్ ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిన వారి పేర్లను పరిశీలిస్తే.. తోట త్రిమూర్తులు, లేళ్ల అప్పిరెడ్డి , కుంభా రవిబాబు, కర్రి పద్మ అనే వాళ్లు ఉన్నారు. వీరంతా రాజకీయ నేతలే.

పైగా తోట త్రిమూర్తులు, లేళ్ల అప్పిరెడ్డిపై తీవ్రమైన కేసులు ఉన్నాయి. వీరి పేర్లను ఏపీ గవర్నర్లు ఆర్టికల్ 171 (5) ప్రకారం వెనక్కి పంపలేదు. ఆమోద ముద్రవేశారుపేరుకు గవర్నర్ కోటా కానీ.. గవర్నర్ ఎమ్మెల్సీలను నామినేట్ చేయలేరు. మంత్రివర్గం చేసిన సిఫారసును మాత్రమే ఆమోదించాలి. ఎమ్మెల్సీల విషయం కాకుండా బిల్లులు, ఇతర విషయాల్లో అయితే ఓ సారి గవర్నర్ వెనక్కి పంపితే.. రెండో సారి అదే బిల్లును పంపితే గవర్నర్ ఆమోదించాలనే సంప్రదాయం ఉంది. ఆ ప్రకారం ఇప్పుడు ఆ ఇద్దరు ఎమ్మెల్సీలను పట్టుదలగా మళ్లీ తెలంగాణ కేబినెట్ లో సిఫారసు చేసి పంపిస్తే.. ఆమోదించాల్సిన పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. కొత్త పేర్లను పంపిస్తే పెద్దగా పంచాయతీ ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే గవర్నర్ కోటా లో రెండు ఎమ్మెల్సీ స్థానాలు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి.

## కేసిఆర్ తోనే

# సమగ్రాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

చప్పుళ్లతో,మహిళలు మంగళ హారతులతో అఖండ స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం ముప్కాల్ మండల కేంద్రంలో 1.95 కోట్లతో ముప్కాల్ నుండి మెండోరా వరకు బిటి రోడ్ రిన్వల్ పనుల శంకుస్థాపన, మెండోరా మండలం సొన్ పెట్ గ్రామంలో సొన్ పెట్ నుండి అప్రోచ్ రోడ్ కాకతీయ కెనాల్ బ్రిడ్జ్ వరకు 35 లక్షల వ్యయం,మెండోరా మండలం దూదిగాం గ్రామంలో సర్వీస్ రోడ్ ఔఊ 44 నుండి శివాజీ విగ్రహం వరకు 55 లక్షల వ్యయంతో,దూదిగాం నుండి మేండోరా వరకు వయా కాకతీయ కెనాల్ 1.30 కోట్ల వ్యయంతో,పోచంపాడ్ గ్రామంలో 1.30 కోట్లతో ఔఊ 44 నుండి ూఖీూఖ డ్యామ్ వరకు సెంట్రల్ లైటింగ్ పనుల శంకుస్థాపన,మెండోరా మండలం వెల్కటూర్ గ్రామంలో వెల్కటూర్ నుండి వెల్కటూర్ తండా వరకు బిటి రోడ్ రిన్వల్ 1.60 కోట్ల వ్యయంతో, వెల్కటూర్ వద్ద స్లాబ్ కల్వర్టు నిర్మాణం (ఔఊ 16 ూ ఔఊ7 వయా రేంజర్ల,దోన్కల్ రోడ్) 2.50 కోట్ల వ్యయంతో, మెండోరా మండలం సావేల్ గ్రామంలో స్లాబ్ కల్వర్టు నిర్మాణం (ఔఊ 16 ూ ఔఊ7 వయా రేంజర్ల,దోన్కల్ రోడ్) 80 లక్షల వ్యయంతో,మేండోరా మండల కేంద్రంలో స్లాబ్ కల్వర్టు నిర్మాణం మేండోరా దూదిగాం రోడ్డు పై 80 లక్షల వ్యయంతో, మెండోరా మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు,మరియు సెంట్రల్ లైటింగ్,డ్రైన్స్ పొడిగింపు పనులు 2.00 కోట్లతో ,మెండోరా శుక్రవారం దేవి టెంపుల్ రోడ్ రూ.1 కోటి వ్యయంతో చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేశారు.కేసిఆర్ తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమయ్యింది మంత్రి వేముల స్పష్టం చేశారు. వేల కోట్లతో బాల్కొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని అన్నారు. కొత్తగా ఏర్పడిన ముప్కాల్, మెండోరా మండలాల్లో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసుకున్నామని వివరించారు. ఇక అర్రాసు పాట లెక్క హామీలు ఇస్తున్న కాంగ్రెస్ ను,ఓట్లు వేసుకున్నాక మొహం చాటేసేబీజేపీ ని ప్రజలు నమ్మొద్దని అన్నారు. వాళ్ళు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏమీ ఇవ్వరు.. ఇక్కడ మాత్రం అన్ని ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. ఓట్లు అయితే డబ్బాల పడనీ, తర్వాత చూద్దాం అనే రకాలని అన్నారు. వారి మభ్యపెట్టే హామీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ,మోస పోతే గోస పడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ నిర్ణయం... బీసీలకు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

మరోసారి నిరూపించుకుందని తేల్చి చెప్పారు. మంగళవారం నాడు శాసనమండలిలో జరిగిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులకు నామినేట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పంపించిన పేర్లను గవర్నర్ తిరస్కరించడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. దేశంలో భారత రాజ్యాంగం నడుస్తుందా లేదా భారతీయ జనతా పార్టీ రాజ్యాంగం నడుస్తుందా అన్న అనుమానం కలిగే విధంగా పలు రాష్ట్రాల్లో గవర్నర్లు ప్రవర్తిస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రతీ రాజ్యాంగబద్ధమైన సంస్థకు ఉండే హక్కులు, పరిధులు వాటికి ఉంటాయనీ, అన్నింటినీ గమనిస్తూ ప్రజలను ఒక్కతాటిపై ముందుకు నడిపించాలన్న దాన్ని పక్కన పెట్టి గవర్నర్లు ఇలా వ్యవహరించడం దురదృష్టకరమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను గవర్నర్ ఆమోదించే సంప్రదాయం ఉందని, దాన్ని విస్మరించి బీసీ వర్గాలకు నష్టం చేయడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఇద్దరు వ్యక్తులు బలహీన వర్గాలకు చెందిన వారిని, ప్రత్యక్ష ఎన్నికల్లో అవకాశాలు రాని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న సదుద్దేశంతో సీఎం కేసీఆర్ ఇచ్చిన రెండు పేర్లను గవర్నర్ తిరస్కరించడంతో భారతీయ జనతా పార్టీ మరోసారి బీసీ వ్యతిరేక పార్టీ అని నిరూపించుకుందని స్పష్టం చేశారు. బిజెపి వ్యవహార శైలిని గమనించాలని ప్రజలకు కవిత విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగపరమైన సంప్రదాయాలను పాటించుకుంటూ వెళ్తే అన్ని వ్యవస్థలు కలిసి పనిచేసే ఆస్కారం కలుగుతుందని, తద్వారా ప్రజలకు స్థిరత్వాన్ని అందించగలుగుతామని అన్నారు. నిరంతరం నెగిటివ్ చర్చను రేకెత్తించడం తప్ప దీనివల్ల ఒరిగేదేమీ లేదని చెప్పారు. బీసీ వర్గాలకు బిజెపి ఏ రకంగా అన్యాయం చేస్తుందో మరోసారి గవర్నర్ నిరూపించారని విమర్శించారు. బీసీ వర్గాలను పైకి తీసుకురావడానికి తమ పార్టీ చర్యలు తీసుకుంటుంటే, బిజెపి పార్టీ అందుకు విరుద్ధంగా పనిచేస్తుందని ఆక్షేపించారు. చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో కవితతో పాటు శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, ఎంపీ వెంకటేష్ నేత , బీసి కమిషన్ మెంబర్ కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ లో నిమజ్జనం

రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరుగుతున్నాయని సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.దాదాపు1,700కు పైగా గణపతి విగ్రహాలు నిమజ్జనం అయ్యాయన్నారు.రాజేంద్రనగర్లోని పత్తికుంట చెరువు వద్ద జరుగుతున్న గణనాథుల నిమజ్జనాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి పరిశీలించారు.

## సంపాదకీయం

# అసలు ఏం జరుగుతోంది..!

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించాలనే తమ కలలను ఆంధ్ర పాలకులు కల్లలుగా మార్చినారంటూ.. ప్రత్యేక రాష్ట్ర మేర్పడితే ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ఉద్యమ నేత చెప్పిన మాటలను తెలంగాణ యువత వంద శాతం విశ్వసించారు. స్వరాష్ట్రంలో లక్షలాది మంది విద్యావంతులైన యువతీ, యువకులు తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్‌గా పేరుగాంచిన గ్రూప్ వన్ పరీక్షల్లో ఉత్తీర్ణతను సాధించి ఆ హోదాతో పాటు తమ కుటుంబాలకు పేరుతెచ్చే క్రమంలో ఈ రాష్ట్ర ప్రజలకు అత్యున్నత స్థాయి పౌర సేవలను అందించాలని కలలు కంటున్నారు. వారి కలలు నెరవేరాలంటే నిష్ణాతులు, నిజాయితీపరులైన సభ్యుల చేర్పుతో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిందే. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సదరు పోటీ పరీక్షల బాధ్యతను నిర్వహించడం కోసం 'తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్' ఏర్పాటు జరిగింది. సామాజిక సేవా తత్పరులు, పోటీ పరీక్షల నిర్వహణలో రాటుదేలిన నిపుణులైన అధికారుల కలబోతగా కమిషన్ నిర్మించబడి కొనసాగుతుందని విశ్వసించారు. కానీ ఆ సంస్థలోని సభ్యుల కూర్పు ఆ సంస్థ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తడం రాష్ట్ర ప్రజలను ఒకింత ఆందోళనకు గురిచేసిన మాట నిజం. పరీక్షల నిర్వహణకు ఓ సమగ్ర జాబ్ క్యాలెండర్ లేకపోవడం, నోటిఫికేషన్ల జారీలో నత్తనడక, పరీక్షల నిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలను మళ్ళీ మళ్ళీ మార్చడం, పరీక్షలను వాయిదా వేయడం, తప్పుల తడక ప్రశ్న పత్రాలతో కోర్టులతో మొట్టికాయలు, రకరకాల తప్పిదాలతో పాటు ప్రశ్న పత్రాల లీకేజీ జరిగిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఇతర పోటీ పరీక్షలతో పాటు గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్షను ప్రభుత్వమే రద్దు చేసింది.ప్రస్తుతం నిరుద్యోగ అభ్యర్థులు ఆ కమిషన్‌ను విశ్వసించడం లేదు. అందుకే ముందుగా పేపర్ల లీకేజీ మూలాలను శోధించి నేరస్థులు ఏ స్థాయి వారైనా శిక్షించాలి. అప్పుడే నిరుద్యోగుల్లో ఎంతో కొంత విశ్వసనీయత ఏర్పడుతుంది. ఓ రాజ్యాంగ సంస్థగా పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన సదరు కమిషన్ యూపీఎస్సీ ప్రేరణగా ఓ విస్పష్టమైన జాబ్ క్యాలెండర్‌ని తయారు చేసి సదరు క్యాలెండర్‌ని త్రికరణ శుద్ధిగా పాటిస్తూ నిజాయితీతో, నిష్పక్షపాతంగా, ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో పరీక్షలను నిర్వహించడంతో పాటు శాస్త్రీయమైన మూల్యాంకనంతో ప్రభుత్వ మార్గదర్శకాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తూ మెరిట్ ప్రాతిపదికన సమర్థులైన అభ్యర్థులనే ఎంపిక చేయాలి.స్వరాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల ద్వారా తమ కుటుంబం ఆర్థిక పరిపుష్ఠిని సాధించగలుగుతుందని ఆశపడ్డారు. ఈ నేపథ్యంలో స్వరాష్ట్రమేర్పడిన తక్షణమే తమ కలలను సాకారం చేసుకోవడం కోసం లక్షలాది మంది నిరుద్యోగులు పోటీ పరీక్షల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను సొంతం చేసుకోవాలని కలలుగన్న మాట అక్షర సత్యం.అయితే ఈ లీకేజీలకు కారణమంటూ.. బోర్డు సభ్యులలోని కొందరిని తప్పించి బోర్డును ప్రక్షాళనచేసి లీకేజీలపై సిట్‌ను ఏర్పరచి దర్యాప్తునకు ఆదేశాలిచ్చింది. అలాగే రద్దయిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షతో పాటు ఇతర లీకేజీ అయిన మిగతా పరీక్షలను అత్యంత పకడ్బందీగా మళ్ళీ ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీకి స్పష్టమైన ఆదేశాలను ఇచ్చింది. అయితే ఓ వైపు సిట్ దర్యాప్తు జరుగుతుండగానే, టీఎస్‌పీఎస్సీ రద్దయిన గ్రూప్-1 పరీక్షను రెండవసారి నిర్వహించింది. లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షను రాశారు. అయితే ఈ పరీక్షను నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని రద్దు చేసింది హైకోర్టు. దీంతో టీఎస్‌పీఎస్సీపై నిరుద్యోగ అభ్యర్థులు మండిపడుతున్నారు. గత అనుభవాన్ని గుర్తుపెట్టుకొని ఈ సారి జాగ్రత్తగా నిర్వహించకుండా, సైబర్ సెక్యూరిటీని గాలికొదిలి పరీక్షకు హాజరైన అభ్యర్థుల నుండి బయోమెట్రిక్ అటెండెన్స్ లాంటి కనీస భద్రతా నిబంధనలను కూడా కొన్ని పరీక్ష కేంద్రాలలో పాటించలేదు. పైగా కొన్ని ఓ.ఎం.ఆర్ షీట్లపై హాల్ టికెట్ నెంబర్లే వేయలేదు. పైగా పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య కన్నా ఎక్కువ ఓ.ఎం.ఆర్ షీట్లను జతచేయడం లాంటి కమిషన్ చర్యలు ఆశ్చర్యాన్ని కలిగించాయి. దీనిపై అభ్యర్థులు కోర్టు మెట్లు ఎక్కగా టీఎస్‌పీఎస్సీ ఖర్చు తగ్గించుకోవడానికి బయోమెట్రిక్ తీసుకోకుండా పరీక్ష నిర్వహించామని కోర్టుకు సమాధానమిచ్చింది. దీంతో పరీక్ష నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ బాధ్యతగా వ్యవహరించలేదని ఈ పరీక్షను హైకోర్టు రద్దు చేసింది. ప్రభుత్వం ప్రచార కార్యక్రమాల కోసం వందల కోట్ల రూపాయలను మంచి నీళ్లలా ఖర్చు చేస్తున్న పాలకులకు గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ కోసం కేవలం ఒక కోటి రూపాయలను కేటాయించలేదా?ఫలితంగా వేల రూపాయల అప్పులు తెచ్చి ఊరికి దూరంగా నగరాలలో హాస్టళ్ళలో నివసిస్తూ కోచింగ్ సెంటర్లలో సంవత్సరాల తరబడి శిక్షణ తీసుకొని పరీక్షలు రాసిన అభ్యర్థులు పరీక్ష రద్దవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు! పైగా ప్రస్తుతం ప్రిపేరవుతున్న అభ్యర్థులు సైతం ఏ పరీక్ష ఫలితం వస్తుందో, ఏ పరీక్ష రద్దౌవుతుందో తెలీక మానసిక ఒత్తిళ్ళకు లోనవుతున్నారు వారిని కాపాడే బాధ్యత ఎవరిది?

## ఓవైసీ వ్యాఖ్యాలు బీజేపీకి ఉపయోగపడుతున్నాయి

### సిఎల్పి నేత బట్టి విక్రమార్క

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :

విజయభేరి బహిరంగ సభ లో ఆరు గ్యారంటీ స్కీమ్స్ సోనియా గాంధీ ప్రకటించారు. మహాలక్ష్మి ద్వారా మహిళలకు 2500 ,ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం. క్వింటలు ధాన్యానికి 500 రూపాయలు. భూమిలేని రైతు కూలీలకు 12 వేలు. యువతకి 5 లక్షల గ్యారంటీ కార్డు. ప్రతి మండలంలో అంతర్జాతీయ స్కూల్ వుంటుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చే యూత ద్వారా 4000 పెన్షన్, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్లలో ఉచిత విద్యుత్, మేము అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజుల్లోపు ఈ ఆరు గ్యారంటీ స్కీమ్స్ అమలు చేస్తామని అన్నారు. వీటిని ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ నేతలు గ్యారంటీ కార్డు ఇస్తారు.రిసీప్ట్ తీసుకుంటారు. వీటిని పడేయద్దు..అందరు 3 నెలలపాటు జాగ్రత్తగా కాపాడుకోవాలి. డిక్లరేషన్ లు అన్ని మేనిఫెస్టో లో పెడుతున్నాం..వాటిని అమలు చేస్తాం. అద్భుత సంపద ,వనరులు తెలంగాణ లో ఉన్నాయి. బడ్జెట్ పై మేధావులతో అనేక లెక్కలు వేసిన తరువాతనే ఆరు గ్యారంటీ స్కీమ్స్ ప్రకటించాం. రాహుల్ గాంధీ దేశానికి గొప్ప నాయకుడు..లౌకికవాది. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన నాయకుడు. సెక్యులర్ నాయకుడు ని ఛాలెంజ్ చేసే అసుదుద్దిన్ వ్యాఖ్యలు బీజేపీ కి ఉపయోగపడుతున్నాయని అయన అన్నారు.

# ఎరువులపై మంత్రి నిరంజన్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :

వానాకాలం పంటల పరిస్థితి, రబీ సాగుకు సన్నద్ధం, రుణమాఫీ అమలు, ఆయిల్ ఫామ్ సాగుపై సచివాలయంలోని మంత్రి క్యాంప్ ఆఫీస్ లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వానాకాలంలో 65 లక్షల ఎకరాల్లో సాగైన వరి.. ఇప్పటి వరకు ఇది అత్యధికం అని ఆయన తెలిపారు. తెలంగాణ చరిత్రలో ఇది ఒక రికార్డ్.. ఒక్క నాగర్ కర్నూలు జిల్లాలో గతంకన్నా ఈ వానాకాలం 24 వేల ఎకరాల్లో పెరిగిన వరి సాగు.. సిద్దిపేట, సంగారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, నారా యణపేట, మహబూబ్ నగర్, వనపర్తి, రంగారెడ్డి జిల్లాలలో గతంకన్నా వరిసాగు పెరిగింది అని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మరోవైపు యాసంగి సాగుకు సన్నద్ధం చేయాలని అధికారులకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచనలు చేశారు. గత ఏడాది యాసంగిలో 74 లక్షల ఎకరాల్లో సాగు.. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం.. ఈ వానాకాలంలో ఇప్పటి వరకు కోటి 26 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు పండగా.. మరో 12 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు.. ఇక, ఆయిల్ ఫామ్ లక్ష 93 వేల ఎకరాలకు చేరింది అని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు అందు బాటులో ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది. ఈ యాసంగికి రైతులకు అందు బాటులో విత్తనాలు, ఎరువులు ఉంటాయని మంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడించారు. సుమారు 75 నుండి 80 లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగవుతాయని ఆయన అంచనా వేశారు. రబీ పంటల సాగుకోసం అన్ని రకాల ఎరువులు కలిపి 18.64 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయింపు..

రబీ సాగు కోసం 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని కేంద్రానికి నివేదిక ఇచ్చినట్లు పేర్కొన్నారు.. అలాగే 9.2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. గత యాసంగి కన్నా సాగు పెరిగే అవకాశం ఉన్నందున తెలంగాణ ప్రభుత్వం కోరిన మేరకు 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రానికి లేఖ రాశామన్నారు.. ఇప్పటి వరకు 21 లక్షల 34 వేల 949 రైతులకు చెందిన రూ. 11,812.14 కోట్లు రుణమాఫీ చేశాం.

అయితే, రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుంది.. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బ్యాంకు ఖాతా మూత పడడం కారణంగా కానీ, సాంకేతిక కారణాలతో కానీ, బ్యాంకుల నుంచి తిరిగి వెళ్లిన రుణమాఫీ నగదు కానీ, లేదా మరే కారణం వలన తిరిగి వెళ్లిన అందరి రైతుల రుణమాఫీ చేస్తామన్నారు.

రుణమాఫీపై సందే హాలున్న రైతులు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులను సంప్ర దించాలి. రుణమాఫీ సందేహాల నివృత్తి కొరకు రాష్ట్ర స్థాయిలో 040 23243667 నంబరులో సంప్రది ంచగలరు. ఇప్పటి వరకు పెండింగులో ఉన్న రైతుభీమా క్లెయిములన్నీ వేగంగా పూర్తిచేయాలని అధికారులకు నిరంజన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# మనోహరాబాద్ పీహెచ్సీని ప్రారంభించిన మంత్రి హరీష్ రావు

మెదక్ - ప్రభాత సూర్యుడు :

రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు మెదక్ జిల్లా తూప్రాన్ పర్యటంలో భాగంగా మనోహరాబాదులో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ ప్రారంభించారు. ఈ కార ్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ హేమలత, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, జిల్లా కలెక్టర్ రజహర్ష్ షా స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ మనోహరాబాద్‌లో పీహెచ్‌సీ ప్రారంభోత్సవం చేసుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది. మనోహరాబాద్ మండలం చేయాలని దశాబ్దల కల ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేశారు. ఈరోజు మనోహ రా బాద్ మండలమైంది ఈ మండలంలో 24 గంటలు పనిచేసే పీ హెచ్ సీ ప్రారంభి ంచుకుంటున్నాం. ఉచితంగా అన్ని రకాల పరీక్షలు వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ప్రజలకు ఉంటుంది. గర్భిణీలకు చెకప్ లు కూడా ఇక్కడ జరుగుతాయి. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకపోతే మనోహరాబాద్ మండలం అయ్యేదా ఇక్కడ ఇంతటి అభివృద్ధి జరిగేదా. త్వరలో మనోహ రాబాద్ కి పోలీస్ స్టేషన్ మంజూరు చేస్తాం. ఈరోజు ప్రభుత్వ ఆసుపత్రిల్లో 76% డెలివరీలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయితే కేసీఆర్ కిట్



తెచ్చి డెలివరీ అయ్యాక ఆటోలో ఇంటి దగ్గర దింపుతున్నామన్నారు.

ఈరోజు పేద ప్రజల కష్టాలు అర్థం చేసుకుని కష్టాలు తీరుస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి. ఎండా కాలంలో కూడా హల్దీ వాగు పారుతుంది అంటే కేసీఆర్ కృషివల్లే సాధ్యమైంది. తాగడానికి మంచినీళ్లు లేనటువంటి ప్రాంతంలో ఈరోజు ప్రతి ఇంటికి నీళ్లు వచ్చాయంటే కేసీఆర్ కృషివల్లే. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ చేయని అభివృద్ధిని ఇప్పుడు చేస్తానంటే నమ్ముతారా? ఈ రోజు కేసీఆర్ వచ్చారు కాబట్టి రైతుకు విలువ పెరిగింది భూమికి ధర పెరిగింది. సద్ది తిన్న రేవు తలవాలి .. పనిచేసిన కేసీఆర్ని ఆశీర్వదించాలని అన్నారు.

# కొత్త మనోహర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెషన్

- పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడుతున్న కొత్త మనోహర్ రెడ్డి
- డీసీసీ అధ్యక్షులు నర్సింహారెడ్డి

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు :

కాంగ్రెస్ లో టికెట్లు అమ్ముకుంటున్నారంటూ రాష్ట్ర స్థాయి నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తూ, బహిరంగ ప్రకటనలు చేస్తూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కొత్త మనోహర్ రెడ్డి పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరించిన కొత్త మనోహర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రస్థాయి నాయకుల పేర్లు ప్రస్తావిస్తూ పార్టీ ప్రతిష్టను దెబ్బ తీసేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు. ముఖ్య నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయడమే కాకుండా, పార్టీ సీనియర్ల పేర్లు ప్రస్తావించడం సరైంది కాదు. ఏదైనా సమస్య ఉంటే ఏఐసీసీ ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రేగారితో, ఏఐసీసీ పెద్దలతో మాట్లాడుకోవాలి. కానీ మీడియాలో బహిరంగ ప్రకటన చేస్తే పార్టీ కఠిన చర్యలు తీసుకుంటుందని డీసీసీ అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు.

# విప్లవ చైతన్యానికి మారుపేరు భగత్ సింగ్

(మొదటిపేజీ తరువాయి)

నిరాకరణ ఉద్యమంలో 13యేండ్లకే పాల్గొన్నాడు. స్కూల్ లో విదేశ వస్తువులను తగలబెట్టాడు. ఉదృతిగా జరుగుతున్న సహాయ నిరాకరణద్యమం చౌరీచౌరా దగ్గర హింసాత్మకంగా మారడంతో గాంధీజీ ఉద్యమం ఆపి ప్రభుత్వానికి లొంగిపోయాడు. .ఇది భగత్ కు నచ్చలేదు.. గాంధీ అహింస నినాదం నచ్చలేదు. బోల్షివిక్ విప్లవం సక్సెస్ కావడంతో యూరప్ ఉద్యమాల చరిత్రను అధ్యయనం చేయసాగాడు. లెనిన్ మార్క్ ఎంగిల్స్ రచించిన పుస్తకాలు చదవసాగాడు..క్రమంగా సామ్యవాదం వైపు మళ్ళాడు. లాహోర్ లోని నేషనల్ కాలేజ్ లో చేరాడు.భగత్ మంచి గాయకుడు.. కవిత్వం బాగా చెప్పేవాడు. 1923లో హిందీసాహిత్యసమ్మేళన్ లో అద్భుతంగా కవితలు చెప్పడంతో దాని అధ్యక్షుడు భీమ్ సేన్ తో పరిచయం అయింది. అతను భగత్ లోని కాంక్షను గమనించి రాంప్రసాద్ బిస్మల్ ,అష్ఫకుల్లాఖాన్ లతో నడపబడుతున్న హిందూస్తానీ రిపబ్లిక్ అసోషియేషన్ లో చేరమన్నాడు. 16 యేండ్ల కుర్రాడు ?మీసకట్టు కూడా ఏర్పడలేదు..తమ ముందు నిలబడి ఉద్యమంలో చేరతానంటే ఏమిచెప్పాలో బిస్మల్ కు అర్థం కాలేదు?.కానీ అష్ఫకుల్లాఖాన్ కు మాత్రం భగత్ లోని స్వాతంత్రకాంక్ష తీవ్రంగా ఉన్నట్లు కనిపించింది. భగత్ కు సభ్యత్వం ఇచ్చాడు. అక్కడ బిస్మల్ కవితలు భగత్ ను చాలా ఉత్తేజపరిచాయి. 1925 లో కకోరి రైల్ దోపిడీ జరిగింది. 1927లో బిస్మల్, అష్ఫకుల్లాఖాన్, రోహన్ సింగ్ లతో పాటు భగత్ బాబాయ్ ని కూడా ఉరితీశారు.బిస్మల్, అష్ఫకుల్లా ఖాన్ చనిపోవడంతో హిందూస్తానీ రిపబ్లిక్ అసోషియన్ ను "హిందూస్తాన్ రిపబ్లిక్ సోషలిష్టు అసోషియేషన్ "గా మార్చారు..దీనికి చంద్రశేఖర్ అజాద్ , భగత్ సింగ్ , సుఖదేవ్ థాపర్ ,శివరాం, రాజ్ గురు, జై గోపాల్ ముఖ్యసభ్యులు. భారత్ లో తొలి సోషలిష్ట్ సంస్థ ఇదే? ఇదే కాకుండా నౌ జవాన్ సభ , కీర్తి కిసాన్ పార్టీలను స్థాపించి యువకులను విప్లవం వైపు విపరీతంగా ఆకర్షించేలా చేసాడు..అయితే సైమన్ కమిషన్ కు వ్యతిరేఖంగా నిరసనలు చేస్తున్న లాలాలజపతిరాయ్ గారిని క్రూరంగా కొట్టడంతో ఆయన మరణించారు. దీనికి భగత్ ప్రత్యక్ష సాక్షి. ఆ సంఘటనకు కారణమైన స్కాట్ ను చంపాలని పథకం వేయగా పొరబాటున సాండర్స్ అనే పోలీసును కాల్చిచంపాడు భగత్.భగత్ ను, సుఖదేవ్ ను చనన్ సింగ్ అనే పోలీసు పట్టుకోగా వీరిని వెంటాడుతూ వస్తున్న చంద్రశేఖర్ అజాద్ చనన్ సింగ్ కాల్చి భగత్ ను,సుఖదేవ్ ను కాపాడి తీసుకెళ్ళిపోయాడు. భగత్ ను కొన్ని రోజులు అజ్ఞాతంలో వుండమనగా?భగత్ సిక్కుల మతవిశ్వాసాలకీ విరుద్ధంగా తలవెంట్రుకలు కత్తిరించుకోని మారువేషంలో కరాచీకి వెళ్ళిపోతాడు.ఇంతలో లార్డ్ కర్జన్ 1905 లో వేసిన విషవిత్తనం మొలకెత్తి విషవృక్షమై హిందూ ముస్లిమ్స్ మధ్య గొడవలకు దారి తీసింది.దీనితో కలత చెందిన భగత్ నాకు మతంలేదు. అది స్వార్థపూరితమైనది..నేను నాస్థికుడినంటూ ప్రకటించాడు.ఎటువంటి విచారణలేకుండా విప్లవవాదులను అరెస్ట్ చేయవచ్చనే చట్టం లాహోర్ శాసనసభలో ప్రవేశపెడుతున్నారని, దానికి నిరసనగా సభలో బాంబువేసి తర్వాత లొంగిపోయి కోర్టులో ప్రపంచాన్ని ఆకర్షించే విధంగా తన వాదనలు వినిపిస్తానన్న భగత్ మాటలను విప్లవసభ్యులందరూ సమర్థించగా చంద్రశేఖర్ అజాద్ మాత్రం తీవ్రంగా వ్యతిరేఖిస్తూ?ఆంగ్లేయులు అంత విశాలహృదయులు కాదనీ ఆ ఆలోచన విరమించుకోమనీ చెప్పి..తాత్కాలికంగా ఆపుతాడు. అయితే చంద్రశేఖర్ అజాద్ లేని సమయం చూసి డమ్మీ బాంబును లాహోర్ శాసనసభలో వేసి లొంగిపోయాడు భగత్. ఆంగ్లేయుల విచారణలో సాండర్స్ చంపిన విషయం కూడా ఒప్పుకోవడంతో భగత్ ,రాజ్ గురు,సుఖదేవ్ లకు ఉరిశిక్ష పడింది.25 ఏళ్ళ వయసులోనే ఉరిశిక్ష పడుతుందని తెలిసినా భగత్ చేసిన సాహసం అసామాన్యం. ఇప్పటి యువత, రాజకీయ నాయకులు భగత్ సింగ్ ని కచ్చితంగా ఆదర్శంగా తీసుకోవాలి. ఈరోజు భగత్ సింగ్ జన్మదినం సందర్భంగా ఆయనకు ఘనమైన జోహార్లు అర్పిస్తున్నాము.

## వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని

**- బైరాన్ ఖాన్ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లు పూర్తి**
**- ఇన్స్పెక్టర్ ఏ.మన్మోహన్ యాదవ్**

అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు




ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని అబ్దుల్లాపూర్ మెట్ మండలం పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ.మన్మోహన్ యాదవ్ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇనాంగూడ, బైరాన్ ఖాన్ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పూర్తి చేసామని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనం కోసం వచ్చే భక్తులు ఎలాంటి అసాంఘిక, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిమజ్జనాన్ని కొనసాగించాలని తెలిపారు. నిమజ్జనానికి తరలి వచ్చే వాహనాల్లోని భక్తులు పోలీసులు సూచించిన మార్గాల గుండానే వెళ్లాలని, ట్రాఫిక్ అంతరాయము ఏర్పడకుండా, డిజె సౌండ్ లతో, కర్రలు ఇతర ఆయుధాలతో రాకూడదని, మద్యం సేవించి, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించరాదని, వీలైనంత త్వరగా నిమజ్జనాన్ని పూర్తి చేసుకోవాలని పోలీసులు సూచించారు. మద్యం షాపుల నిషేధం అమల్లో ఉన్నందున బెల్ట్ షాపులు నిర్వహించరాదని అన్నారు. భక్తులు ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఏర్పడిన వెంటనే డయల్ 100, అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ లేదా పెట్రోల్ మొబైల్ నెంబర్ లకు (8712662650, 8712662651/652) వెంటనే సమాచారాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ తెలిపారు.



## అంగన్వాడి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తాం

**- సిఐటియు మండల కన్వీనర్ బుగ్గరాములు మండల నాయకులు తులసిగారి నరసింహ**



ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడిల సమ్మె 17వ రోజు . బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో వంట వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బుగ్గరాములు, మండల నాయకులు తులసిగారి నరసింహ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాట విరమించేది లేదన్నారు అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరైనది కాదు. వెంటనే వారికి 26వేల వేతనం నిర్ణయించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా, పెన్షన్స్ సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే అంగన్వాడి సమస్యల పైన చర్చలు జరిపి సమ్మెను విరివింపజేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు గీత, బాలమణి, అహల్య, శోభ, వనజ, సువర్ణ, లక్ష్మి, అండాలు, పెంటమ్మ, యాదమ్మ, భాగ్యమ్మ, పార్వతమ్మ, హేమలత, సరిత, మారమ్మ, నిర్మల, మనోరమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరా అందరిని చల్లంగా చూడు

**- గణపతిని వేడుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

జగిత్యాల - ప్రభాత సూర్యుడు : అందరిని చల్లంగా చూసి కాపాడాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కోరారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లోని రామాలయంలో గణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడిని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా గోత్ర నామాధులతో పూజారి అర్చన చేసి ఆశీర్వధించారు. ఈ సందర్బంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఏ పూజ, శుభకార్యం మొద లుపెట్టిన మొదటగా వినాయకుడికి పూజలు చేస్తారని, గణేషుడికి అంతటి ప్రాముఖ్యత ఉందన్నారు. నిన్ను కొలిచే భక్తులతో పాటు సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తూ కాపాడు విఘ్నేశ్వరా.. అంటూ వేడుకున్నానని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయగా ఎమ్మెల్సీ పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ముంజాల రఘువీర్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండా మధు, నాయకులు చిట్ల అంజన్న, నితీష్ రావు, రవీందర్, కొండ్ర రాజేష్, దిక్షిత్, కళ్ళు శ్రీను, సాకేత్, కిషోర్, సాయి, అభి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ గౌరవానికి ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ

## అడిషనల్ కలెక్టర్ బి.ఎస్.లత



జగిత్యాల - ప్రభాత సూర్యుడు : తెలంగాణ కోసం మంత్రి పదని త్యజించి చరిత్రలో నిలిచిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) బి.ఎస్.లత అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాంప్లెక్స్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఆయన తెలంగాణ కు అందించిన సేవలను,త్యాగాలను గుర్తు చేశారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీక గా కొండా లక్ష్మణ్ బాపూజీ నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) దివాకర్,టీ బీసీ జేఏసీ ,సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్,టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్,జిల్లా బీసీ సంక్షేమ అధికారి సాయిబాబా,హౌజింగ్ ఏఈ రాజేశ్వర్,జిల్లా ట్రెజరీ అధికారిణి సోఫియా, కలెక్టరేట్ ఏవో.హన్మంత రావు,వివిధ శాఖల జిల్లా అధికారులు,బీసీ జేఏసీ ప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారు. చిరస్మరణీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పరితపించి తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాలలో కీలకపాత్ర వహించి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ ఆని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. బుధవారం ఆయన108 జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడిన, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ తొలి ఉద్యమకారుడు, దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, అవే విలువలను జీవితాంతం పాటిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్ఫూర్తిగా నిలిచిన, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం, సహకార రంగాల పటిష్టత కోసం జీవితమంతా కృషి చేసినారని అన్నారు. నిబద్ధతతో రాష్ట్ర సాధన కోసం పరితపించిన ఆయన పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయమన్నారు. దేశం కోసం, రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగం, కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలని వారి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని ఆయన ఆశయాలను కొనసాగించడమే మననీ ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలోకొండ లక్ష్మణ్ బాపూజీ కి నివాళులు అర్పించిన వారిలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర రావు,ఏవో అమర్నాథ్ ,ఆర్.ఐ లు జానీమియా,వేణు,సీసీఎస్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,ఆర్ ఎస్ఐ లు,డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు..అపార దేశ భక్తుడు, నిఖార్సైన తెలంగాణ వాది కొండ లక్ష్మణ్ బాపూజీస్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు, నైజాం వ్యతిరేక పోరాట యోధుడు, ప్రజా ప్రతినిధి, బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం కృషి చేసిన వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ కొనియాడారు. కొండ లక్ష్మణ్ బాపూజీ 108 వ జయంతి ని పురస్కరించుకొని అంగడి బజార్లో జరిగిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరం పాల్గొని తనదైన పంథాలో ఉద్యమించారని, తొలి విడత తెలంగాణ పోరాటంలో అరెస్టైన వారి పక్షాన నిలిచి ఉచితంగా వారిని బయటకు తీసుకొచ్చారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాంబు దాడికి పాల్పడి సంవత్సరం పాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయి ఆపరేషన్ పోలో తరువాత ఆయనపై ఉన్న కేసులు ఎత్తి వేయడంతో బయటకు వచ్చిన తొలి తెలంగాణ యోధుడు బాపూజీ అని అన్నారు. చిన్న రాష్ట్రాల ఆకాంక్షను బలంగా వినిపించి, ఆ తరువాత ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తెలంగాణ కాంగ్రెస్ ను ఏర్పాటు చేశారు. ఆ తరువాత రాజకీయ పరిణామాల వల్ల తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఐతే బీసీలకు సంబంధించిన మండల్ కమిషన్ ను అమలు చేయాలని, బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంలో ఉన్న వీపి సింగ్ ప్రభుత్వం ఒప్పుకుంది. ఐనప్పటికీ ఒక ప్రధాన నాయకుడు బీసీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడడం వల్ల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ ఐక్యవేదిక ఏర్పాటు కాగా దాని కార్యాలయాన్ని జలదృశ్యంలో నిర్మించారు. కాగా కక్ష గట్టిన అప్పటి టీడీపీ ప్రభుత్వం జలదృశ్యాన్ని నేలమట్టం చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల గంగాధర్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి బత్తుల కొండయ్య, బీసీ నాయకులు రాగిళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేదలందరికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ ఆశయం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో వారికి ఉచితంగా డబల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి చివరి పేదవాడికి కూడా ఇల్లు అందించడమే మా ఆశయమని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మాత్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో మూడవ విడత ఆన్ లైన్ లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు కార్యక్రమానికి హోమ్ శాఖ మంత్రి మహమూద్ అలీ,నగర మేయర్ విజయ లక్ష్మి, , యం ఎల్ సి మిర్జా రహమత్ బెగ్,,ఎమ్మెల్యే లు, కాలేరు వెంకటేష్, అరికెపూడి గాంధీ, సుధీర్ రెడ్డి,, జి హెచ్ ఎం సి కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ల సమక్షంలో రాండ మైజేషన్ సాఫ్ట్ వెర్ ద్వారా ఆన్ లైన్ డ్రా నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగింది. జిహెచ్ఎంసి పరిధిలోని 24 నియోజక వర్గాలలో మూడవ విడతగా 36884 మంది లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందని మంత్రి అన్నారు. మూడవ విడత ప్రక్రియలో వికలాంగులు ఎస్సీ ,ఎస్టీ వారికి రిజర్వేషన్ కల్పించడం వికలాంగులకు 1843 ఎస్సీలకు 6271ఎస్టీలకు,2215 ఇతరులకు 26555 కేటాయించడం జరిగిందని మంత్రి అన్నారు. కేటాయింపులో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. మానవ ప్రయత్నంతో లాటరీ ద్వారా కేటాయింపు చేసే ప్రక్రియ కన్నా ఇది ఎన్నో రేట్లు నాణ్యత, పారదర్శకత, జవాబుదారీ తనాన్ని సూచిస్తుందని అన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మంత్రి అన్నారు. పేద ,మధ్య తరగతి వారు ఎంతో గొప్పగా బ్రతకాలని ఉద్దేశంతో ఖరీదైన ప్రాంతాలలో ఇల్లు కట్టించి ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్లకు మంత్రి అభినందనలు తెలిపారు.

## లడ్డు కైవసం చేసుకున్న మాజీ ఎంపీపీ రజిత రాజు నాయక్

**- లడ్డూ వేలం 1,65,000 రూపాయలు**



యాచారం - ప్రభాత సూర్యుడు : యాచారం మండల పరిధిలోని నందివనపర్తి అనుబంధ గ్రామం బొల్లిగుట్టతండా బంజారా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గననాథుడి లడ్డు వేలం పాటలో 1,65,000 రూపాయలకు లడ్డు కైవసం చేసుకున్న మాజీ ఎంపీపీ వర్త్యావత్ రాజునాయక్ వినాయకుడి లడ్డు నవరాత్రులు పూజలందుకున్న లడ్డును వేలంపాటలో కైవసం చేసుకున్నారు. అనంతరం వినాయకుడి ఆశీస్సులతో తండా వాసులు, గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి, గౌర శేఖర్ మరియు తండా వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 1400 కేజీల గంజాయి పట్టివేత


**ఇద్దరు నిందితుల పట్టివేత**
**గంజాయి విలువ మూడు కోట్లు**

చింతపల్లి - పభాత సూర్యుడు :

చింతపల్లి మండలం కుడుముసారి పంచాయతీ నిమ్మపాడు వద్ద తెల్లవారుజామున పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఓ కారుకు ఎస్కార్టుగా ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయారు. వారి వెనుక వస్తున్న కారును ఆపేందుకు పోలీసులు యత్నించారు. అందులో నుంచి ఒకరు దూకి పారిపోగా.. డ్రైవరుతో పాటు మరొకరిని అదుపులోకి తీసుకుని, 1400 కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని దగుడుపల్లి గ్రామానికి చెందిన కిలో సత్తిబాబు మరికొందరు అల్లూరు సీతారామరాజు జిల్లా మీదుగా గంజాయిని మైదాన ప్రాంతానికి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. చింతపల్లి మండలం భీమసింగికి చెందిన డ్రైవరు ప్రసాద్, రాళ్లగెడ్డకు చెందిన సిందేరి చిన్నయ్యను అరెస్టు చేసి, రూ.లక్ష నగదు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తనిఖీల్లో సీఐ రమేష్, చింతపల్లి, అన్నవరం ఎస్సైలు ఎంవీ రమణ, అరుణ్కిరణ్ పాల్గొన్నారు.

## తెలంగాణలో అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలి

**- కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మడుపు వెంకటేష్**



ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి అసైన్డ్ భూములపై ప్రభుత్వం యాజమాన్య హక్కులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల ఉపాధ్యక్షుడు మడుపు వెంకటేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అసైన్డ్ భూములు పొందిన వారు చాలామంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారు. ఈ భూములపై అమ్మకాలు, కొనుగోళ్లు జరపకూడదు అనే నిబంధన తొలగించి అత్యవసర సమయాల్లో భూమిని విక్రయించుకునేందుకు వెసులుబాటు కల్పించి వారికి భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని ఆయన కోరారు. అసైన్డ్ భూములు కేటాయించి (అసైన్ చేసి) 20 ఏళ్లు పూర్తయితే వాటిని పొందిన రైతులకు ఆయా భూములపై యాజమాన్య సంపూర్ణ హక్కులను ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించిన విషయం విధితమే. కావున ఏపీలో అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులు ఇచ్చినప్పుడు మన తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో 24 లక్షల ఎకరాల భూమి అసైన్ భూమి ఉంది వారికి యాజమాన్య హక్కులు ఇచ్చినట్లయితే 15 లక్షల మంది రైతు కుటుంబాలకి లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాజేంద్రనగర్ లో నిమజ్జనం సీపీ పరిశీలన

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరుగుతున్నాయని సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. దాదాపు1,700కు పైగా గణపతి విగ్రహాలు నిమజ్జనం అయ్యాయన్నారు. రాజేంద్రనగర్లోని పత్తికుంట చెరువు వద్ద జరుగుతున్న గణనాథుల నిమజ్జనాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి పరిశీలించారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215